ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025 | 5



ఆంధ్ర భద్రాద్రిలో వైభవంగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి.. కె.గంగవరం మండలం సత్యవాడలో వేడుకలకు మంత్రి సుభాష్ హాజరయ్యారు.. పెదపూడి మండలం గొల్లలమామిడాడలో జరిగిన వేడుకలకు ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున క్యూకట్టారు.. సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. -7లో



జి.మామిడాడలో సీతారాములకు సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



కె.గంగవరం మండలం సత్యవాడ కొత్తపేట వీధిలో కొలువైన సీతారాములను దర్శించుకుంటున్న కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



పి.గన్నవరం వైనతేయ గోదావరి నదీతీరాన కొలువైన పట్టాభిరామ స్వామి ఆలయంలో సీతమ్మవారికి సమర్పించిన కంతసారె

సీసీ.. చూసీ!



గత నెల 24న జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి ఎన్నో సంచనాలకు వేదికైంది.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది..ఆ ఘటనకు సీసీ కెమెరాలే దాదాపుగా చెక్ పెట్టాయి.ఆయన అదే రోజు హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై సుమారు 400 కిలోమీటర్లు పైనే ప్రయాణించారు. ఆ ఘటనపై క్రైస్తవులంతా ఏకమయ్యారు. పాస్టర్‌ను హత్య చేశారంటూ గొంతెత్తారు.. ఎవరికి వారు రకరకాల వాదనలు వినిపించారు. పోలీసులు దర్యాప్తు ఆరంభించారు.. సీసీ అస్త్రం బయటకు తీశారు.. ఆయన ప్రయాణించిన దారిలో సుమారు 300 సీసీ కెమెరాలు పరిశీలించారు.. ఏం జరిగిందో చెప్పడానికి ప్రయత్నించారు. అల్లర్లను చల్లార్చారు. అసలు సీసీ కెమెరాలే లేకపోతే దర్యాప్తు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి ఉండేది. నిఘా నేత్రాల వల్ల ఆ కేసులో దాదాపుగా చిక్కుముళ్ల వీడినట్టు సమాచారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటులో ఇటు యంత్రాంగం, అటు జనంలోనూ అలసత్వం కనబడు తోంది. సర్కారు వారి కెమెరాలను రకరకాల దోషాలు పట్టిపీడిస్తుంటే.. ప్రజలు వాటిని ఏర్పాటు చేసుకోవడంపై విముఖత చూపుతున్నారు.



చిల్లకల్లు వద్ద రోడ్డుపై పడిపోయిన ప్రవీణ్ (ఫైల్)

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/పి.గన్నవరం -ఆంధ్రజ్యోతి)

సవాలక్ష సమస్యల పరిష్కారంలో కీలక భూమిక వహిస్తున్నది 'నిఘా' నేత్రమే. నేరాల దర్యాప్తు, నియంత్రణలో మూడో కన్ను అత్యంత కీలకంగా మారింది.అధిక దర్యాప్తులు సీసీ కెమెరాల ఆధారంగానే ఓ కొలిక్కి వస్తున్నాయి. పలు కీలకమైన కేసుల్లో సీసీ కెమెరాల ఫుటేజీలు లభ్యత వల్ల ఏళ్ల పాటు సాగాల్సిన దర్యాప్తులు వేగంగా జరిగి నేరస్తులను జైలుకు పంపిస్తున్నాయి. నేర నియంత్రణలో సీసీ కెమెరా ఫుటేజీలు కీలకంగా ఉన్నా ఏర్పాటులో కరువు కనబడుతోంది.తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో కనీసం 5 వేల కుపైనే సీసీ కెమెరాలు ఉండాలి. మరో రెండేళ్లలో పుష్కరాలు రానున్నాయి.కానీ ప్రస్తుతం 375 కెమెరాలు ఉండగా..కేవలం 185 పనిచేస్తున్నాయి. అధికారికంగా 480 కెమెరాలు ఉన్నాయని లెక్క చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో 15 కెమెరాలు సాంకేతిక ఇబ్బందుల వల్ల పనిచేయడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 10 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా పనిచేస్తూ ఈ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 320 సర్కారు కెమెరాలు మాత్రమే విధుల్లో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగం ఎన్నో కీలకమైన కేసులను చేధించింది. కోనసీమ జిల్లా పరిధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 2వేలకు పైనే సీసీ కెమెరాలు ఉన్నాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 3,622 సీసీ, సిటిజెడ్ కెమెరాలు ఉన్నాయి. జిల్లా పోలీస్‌శాఖకు సంబంధించి 540 సీసీ, సిటిజెడ్ కెమెరాలుండగా పోలీస్‌శాఖ 16 డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ కెమెరాలు నిరంతచాయం పని చేస్తూ అసాం ఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పా టు చేస్తే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని రూపొందించవచ్చని ఎస్పీ బిందుమాధవ్ ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో ప్రైవేటు కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది.శివారు, సమ స్యాత్మక ప్రాంతాల్లో నిఘానేత్రాలు మసక బారిపోయాయి.

పోలీస్ కెమెరాలకు మ్యాట్రిక్స్

పోలీస్ సీసీ కెమెరాలను మ్యాట్రిక్స్ సంస్థకు అప్పగించారు. కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ, మరమ్మతులు ఆ సంస్థ చూడాల్సి ఉంది. కానీ ఆ సంస్థ అలసత్వం వల్ల కెమెరాల పని తీరు రోజు రోజుకూ మందగిస్తోందని చెబుతున్నారు. మ్యాట్రిక్స్ సంస్థకు విజయవాడలో సర్వర్ ఉంది. సీసీ ఫుటేజీ 3 రోజుల వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటుంది.తర్వాత 28 రోజుల వరకూ మ్యాట్రిక్స్ వద్ద ఉంటుంది.మూడు రోజుల తర్వాత ఏదైనా ఫుటేజీ అవసరమైతే కెమెరా ఐపీతో లెటర్ రాసి మ్యాట్రిక్స్ వద్ద నుంచి తీసుకోవాలి. 28 రోజులు దాటితే సీసీ ఫుటేజీ ఉండదు.

హైవేపై.. సేఫ్ వే..

జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోని సీసీ కెమెరాల ఫుటేజీ సేఫ్‌వే సంస్థ వద్ద 30 రోజుల వరకూ ఉంటుంది. ఆ గడువు ముగిస్తే ఫుటేజీ దొరకదు. ఏదైనా ప్రమాద ఘటనలు ఉంటే ఆ ఫుటేజీని జాగ్రత్త పరు స్తున్నామని చెబుతున్నారు.ఎంతో ప్రాధాన్యత ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలకు ప్రభుత్వం ఎందుకు సర్వర్లు ఏర్పాటు చేయడం లేదనేది ప్రశ్నగానే మిగులుతోంది.

కేసుల ఛేదనలో బ్రహ్మాస్త్రం..సీసీ కెమెరాలు

- చూస్తున్నాయ్.. కనిపెట్టేస్తున్నాయ్
- అయినా ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం
- సర్కారుకు సీసీ కెమెరాలు కరువు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 1520
- ఎక్కడికక్కడ పాడైపోతున్న వైనం
- ప్రైవేటు సీసీ కెమెరాలపైనే ఆధారం
- జాతీయ రహదారిలో దారుణం
- జొన్నాడ టూ అన్నవరం 121
- మరిన్ని ఏర్పాటుకు డిమాండ్

హై..వే పట్టదా!

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. జాతీయ రహదారిపై కిలోమీటరుకు ఒకటి చొప్పున జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వరకూ 49, దివాన్ చెరువు నుంచి-అన్నవరం వరకూ 72 కెమెరాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ సేఫ్‌వే సంస్థ చూస్తోంది. అయితే హైవే మరమ్మతులు, జొన్నాడ దగ్గర జరుగుతున్న ఫ్లైఓవర్ వంటి పనులు చేస్తున్నప్పుడు వైర్లు తెగిపోవడంతో రోజుల తరబడి సమస్య వస్తోంది. జొన్నాడ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల వల్ల సుమారు 40 కెమెరాలు పని చేయడం లేదు. ఇలాంటి పరిస్థితి వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమికంగా నిజ నిర్ధారణ అత్యంత కష్టంగా మారుతోంది.

కాకినాడలో సీసీసీ నిరుపయోగం..

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిఘా నేత్రానికి విఘాతం కలిగింది.కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైన తర్వాత మొదటిగా కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను తలపెట్టింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాజెక్టు 2017లో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులు రూ.90 కోట్లతో చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 71 ప్రాంతాల్లో 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతలను సెర్టిలైట్ సంస్థకు 2019లో అప్పగించారు. నెలకు రూ.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.ఆరు కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.30 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లుగా సంస్థకు చెల్లించాల్సిన రూ.19.50 కోట్ల బిల్లుల బకాయిలు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చెల్లించలేదు. నిర్వహణ భారంగా మారడంతో నిర్వాహకులు అగ్రిమెంట్ మధ్యలోనే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ సెంటర్‌లో 35 మంది పనిచేసేవారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరుపయోగంగా మారింది. కార్పొరేషన్ అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీలు చూశాయ్..పట్టించాయ్..

- రాజమహేంద్రవరంలో వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలెత్తించిన దొంగోడి ఆటకు సీసీ కెమెరాలు చెక్ పెట్టాయి. రెండేళ్ల కిందట బొమ్మూరులోని ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై యువకుడు అత్యాచారం చేశాడు.ఈ కేసులో సీసీ కెమెరాలే నేరస్తుడిని కటకటాల్లోకి నెట్టాయి.
- అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన భారీ దోపిడీ కేసును సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి భారీ ఎత్తున రికవరీ చేశారనడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.
- 2022 నవంబర్‌లో కాకినాడ జిల్లా తునిలో టీడీపీ నాయ కుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావుపై కత్తితో దాడి చేసి బైక్‌పై ఉడాయించిన నిందితుడిని ఇంటి వద్ద ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నారు..
- గత వైసీపీ ప్రభుత్వంలో దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని చంపి ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేసిన కేసులోనూ సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. ఆ హత్యకు ముందు ఆ దళిత యువకుడిని అనంతబాబు ఎలా తీసుకువెళ్లాడో సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. వాటి ఆధారంగా కేసు వెలుగులోకి వచ్చింది.ఇలా ఒకటేమిటి నేరాలకు సంబంధించిన ఏ కేసులోనైనా సీసీ కెమెరాలే కీలకంగా మారాయి.

డీఎస్సీకి.. వేళాయె!



ఈ వారంలోనే నోటిఫికేషన్?

- విద్యాశాఖ సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 1278 ఖాళీలు
- నిరుద్యోగుల ఎదురుచూపులు
- ఎస్సీ వర్గీకరణతో నిలుపుదల
- రోస్టర్ పాయింట్లు వస్తే విడుదల

కాకినాడ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కొలువుల జాతర మొదలు కానుంది. ఈ వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే దీని కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇదొకటి. ప్రస్తుతం దీని అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇప్పటికే టెట్ పూర్తి

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది.అంతకుముందు ఎన్నికల హామీల్లో ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఆ ఊసే మరిచింది. దీంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఆ ఐదేళ్లూ ఎదురు చూపులే మిగిలాయి.2024లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి ఇప్పటికే ఫలితాలు ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసి స్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయాలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5,వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.మరో వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేష న్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మం దికి పైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఈ ఫలితాలు నవంబరులోనే విడుదల కావడంతో అదే నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అభ్యర్థులంతా భావించారు. అప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయసు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ వెలువరిస్తారని ఆశించారు.ప్రస్తుతం నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయి. తాజాగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రక్రియ మొత్తం జూన్ కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆ దిశగా అడుగులు వేస్తుండడంతో అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

వర్గీకరణ పాయింట్లు రాగానే..

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఆర్డినెన్స్ జారీ కాగానే సాధారణ పరిపాలన శాఖ రిజర్వేషన్లపై కొత్త రోస్టర్ విడుదల చేస్తుంది. దానికి అనుగుణంగా పోస్టులు కేటాయించి, నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రోస్టర్ పాయింట్లు విడుదలైన మరుసటి రోజు లేదా ఆ తర్వాత రోజు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుంది.వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది.

సత్యదేవుడి ఆదాయం రూ.142.89 కోట్లు
7
అమలాపురంలో బాలిక కిడ్నాప్‌నకు యత్నం

నేడు అమలాపురంలో..

వేంకటేశ్వరస్వామి కల్యాణం





అమలాపురంలో విద్యుత్‌కాంతులతో కల్యాణశోభను సంతరించుకున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం మహిపాలవీధిలోని అలివేలు మంగతాయారు, బీబీనాంచారి సమేత వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణం సోమవారం ఉదయం 8.58గంటలకు నిర్వహించనున్నారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవకమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న ఆధ్వర్యంలో ఇప్పటికే స్వామికల్యాణోత్సవ ఏర్పాట్లను పూర్తిచేశారు. యిండుగుల శ్రీనివాసరావు-పద్మావతి, వీరభద్రరావు-నాగరాధాకృష్ణకుమారి, శివరామసూర్యవరప్రసాద్-శాంతాదేవి దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించనున్నారు. సుదర్శనం మురళీకృష్ణమాచార్యుల ఆచార్య బ్రహ్మత్వంలో కల్యాణం నిర్వహిస్తారు. విద్యుత్‌కాంతులతో ఇప్పటికే ఆలయం కల్యాణశోభను సంతరించుకుంది.

ఘనంగా ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం

7



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంవద్ద గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

- నేడు అంకురార్పణ
- రేపు కల్యాణం, రథోత్సవం

7



ఆకాశం.. బద్దలైందా!

ఆకాశం బద్దలైందా.. అన్నట్టుగా కనిపిస్తూ.. అంతా కనికట్టుగా ఉన్న ఈ దృశ్యం ఆదివారం ఉదయం ఆలమూరులో కనిపించగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. (ఆంధ్రజ్యోతి, ఆలమూరు)

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురంటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10గంటలనుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందనికలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమార్గాలు పొందాలని విజ్ఞప్తిచేశారు. జిల్లాస్థాయితోపాటు రెవెన్యూ డివిజన్, మండల, మున్సిపల్‌స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కూలేందుకు సిద్ధంగా..

- వ్యాఘ్రేశ్వరం-మోడేకుర్రు మధ్య శిథిలస్థితిలో వారధి



అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరం-మోడేకుర్రు మధ్యలో విరిగిపడి శిథిలస్థితిలో ఉన్న వంతెన

అంబాజీపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాలను కలిపే వారిధి శిథిలస్థితికి చేరడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో రెండు గ్రామాలను కలిపే వంతెన శిథిలస్థితికి చేరుకుని ప్రమాదభరితంగా మారింది. పుల్లేటికుర్రు-మోడేకుర్రును కలిపే ఈ వంతెనపై రోజూ వందలాదిమంది విద్యార్థులు, రైతులు, ప్రజలు ప్రయాణిస్తుంటారు. కొత్తపేటమండలం మోడేకుర్రు, చిరతపూడి గ్రామాలకు ఈ రహదారి మార్గం దగ్గర కావడంతో వంతెనపైనే ప్రయాణాలు సాగిస్తుంటారు. రైతులు తమ వ్యవసాయఉత్పత్తులను దీనిపైనే తరలిస్తుంటారు. ఈ వంతెన మధ్యలో విరిగిపోవడంతో స్థానికులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేపట్టారు. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





గొల్లల మామిడాడలో కోదండరాముడు, సీతాదేవిలకు సమర్పించిన కొబ్బరి బొండాలు... అమ్మవారికి ధరింపజేసే మాంగల్యాన్ని చూపిస్తున్న అర్చకస్వామి

కల్యాణ వైభోగమే

కనుల పండువగా కోదండరాముని కల్యాణ మహోత్సవం

రామనామస్మరణతో మార్మోగిన గొల్లల మామిడాడ

సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



తలంబ్రాలు బియ్యంపై మూడు భాషల్లో రాసిన రామనామం

కాకినాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోదండ రాముడి కల్యాణ వేడుకతో కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీరామనవమి పర్వదినాన జరిగిన సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ ఊరంతా రామనామస్మరణతో మార్మోగింది. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిని భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆంధ్రా భద్రాద్రిగా పేర్గాంచిన ఈ ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే సీతారాముల దర్శనానికి అనుమతిచ్చారు. శనివారం రాత్రికే పెద్ద ఎత్తున భక్తులు మామిడాడ చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం పుష్కరిణి వద్ద ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వివాహం కానివారు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పెళ్లి తలంబ్రాలను శిరస్సుపై ధరించారు. సంతానం లేని దంపతులు స్వామివారిని దర్శించుకుని సంతానప్రాప్తి కలిగించాలని వేడుకున్నారు. స్వామి అనుగ్రహంతో సంతానం కలిగిందని నమ్మిన దంపతులు పుట్టిన పిల్లలను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి మంచి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. జి.మామిడాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి యువరాజారెడ్డి కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామనామ తలంబ్రాలను అందజేశారు. చైత్ర శుద్ధ నవమి ఆదివారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల విగ్రహాలను కల్యాణ వేదికపైకి వేదపండితులు తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు క్రతువులను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. రాష్ట్రం నలుమూలాల నుంచి తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. పుష్కరిణి వద్ద ఉచితఅన్నదానం నిర్వహించారు.



శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు



కల్యాణాన్ని తిలకిస్తున్న అశేష భక్తజనం



తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

వెంకన్న కల్యాణానికి వేళాయె...

- నేటి నుంచి వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- రేపు తీర్థం, రథోత్సవం, కల్యాణం

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకూ నిర్వహించే కల్యాణోత్సవాలకు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో రెండు దఫాలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా భక్తుల సౌకర్యాలపై సమీక్షించి ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఆదేశించారు. 7 దశమి సోమవారం స్వామివారి ధ్వజారోహణ, నిత్యబలిహరణ, 8న ఏకాదశి మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, రాత్రి కల్యాణం, 9 ద్వాదశి బుధవారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 10 త్రయోదశి గురువారం సద్యసం, చతుర్థి శుక్రవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, 12 పౌర్ణమి శనివారం మహా పూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం, 13 పాడ్యమి ఆదివారం స్వామివారి శ్రీపుష్పయాగముతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాద్ చార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.



స్వామివారి రథానికి మెరుగులు దిద్దుతున్న దృశ్యం

వార్షిక ఆదాయం రూ.30 కోట్లు

గతేడాది గ్రేడ్-1 స్థాయి కలిగిన ఈ ఆలయం డీసీ హోదాకు చేరుకుంది. స్వామివారి వార్షిక ఆదాయం రూ.30 కోట్లకు చేరుకుంది. అన్నదాన విరాళాలు రూ.10కోట్లు పైమాటే. దాతల సమకూరుస్తున్న విరాళాలతో పుణ్యక్షేత్రం విరాజిల్లుతుంది.

ఆలయాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే పాలకులు ఆలయాభివృద్ధిపై దృష్టిపెట్టారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రతి శనివారం 50 వేలకు పైనే భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఆ దిశగా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. రహదారులు పార్కింగ్ ప్రహరీ, టాయిలెట్లు, సీసీ రోడ్లు, గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్‌కు టైల్స్, ప్లైఓవర్ తదితర నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నారు.

స్వామివారి చరిత్ర...

స్వయంభూ ఎర్రచందన మనే కొయ్యవిగ్రహంతో మూర్తిభవించిన పరందాముడు ఈయన. ఇటువంటి విగ్రహం భారత దేశంలో మరెక్కడ లేదు. పూర్వం గౌతమి గోదావరి నదీలో ఓ చందనం పెట్టే లభ్యమైంది. ఋషి పుంగవులతో అలరాలుతున్న ఆ ప్రాంతంలో ఈ చందనం పెట్టె లభించడంతో గ్రామస్తులు ఆ విగ్రహాన్ని మేళతాళ మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి ప్రతిష్ఠించిన్నట్టు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. అలనాడు నాటి నౌకపురి పినపోతు గజేంద్రుడు సముద్రంలో తమ ఓడలు కొట్టుకుపోయాయి. ఓడలన్ని సురక్షితంగా వస్తే ఆలయం నిర్మిస్తామని స్వామివారిని వేడుకున్నారు. ఓడలన్ని క్షేమంగా ఒడ్డుకు చేరడంతో దేవాలయం నిర్మించినట్టు చరిత్ర చెబుతుంది. అనంతరం స్వామి విశిష్టతను తెలుసుకున్న నాటి సంస్థానదీసులు వత్సవాయి తిమ్మగజపతి మహారాజు స్వామిని దర్శించుకున్నారు. దూపదీప నైవేద్యాల నిమిత్తం 275 ఎకరాలు, స్వామివారి సేవకుల మాన్యాలకు 110 ఎకరాలు భూములు విరాళంగా అందించారు. 7 శనివారాల వెంకన్న దర్శనం 7 జన్మల పుణ్యఫలంగా భక్తులు తరలి వస్తున్నారు.



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు



ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాం. ఆలయ ఎదురుగా కోనేరు నిర్మాణం, 3 వేలమంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించేలా భవన నిర్మాణం, డార్మేటరి, వసతిగృహాల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రూ.10కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా రూపొందిస్తున్నాం.

\- బండారు సత్యానందరావు, ఎమ్మెల్యే, కొత్తపేట

ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్యాణోత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. చూడచక్కని కల్యాణ వేదిక, భక్తులకు ఎండ వేడి తగలకుండా మజ్జిగ చలివేంద్రాలు, పాలు, బిస్కెట్లు, అన్నసమారాధన చేపడతాం. వివిధ శాఖలకు చెందిన అధికారులు భాగస్వామ్యంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం.

\- నల్లం సూర్యచక్రధరరావు, ఉపకమిషనరు, వాడపల్లి దేవస్థానం

అంగరంగ వైభవంగా...

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం




జగన్మోహిని కేశవస్వామి కల్యాణ దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమజిల్లాలో పురాతన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి దివ్యకల్యాణ మహోత్సవం నవమి ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి మేల్కొపు సేవ, నిరాజన మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గరుడ వాహన సేవ మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కేశవదీక్షదారులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సుందరంగా పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామి,అమ్మవార్లను తీసుకువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. వేదపడింతులు ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని భక్తిశ్రద్ధలతో తిలకించారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ ఈవో బీహెచ్వీ.రమణమూర్తి దంపతులు స్వామివారికి సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో

సత్యదేవుని ఆదాయం రూ.142.89 కోట్లు

- వ్యయం 147.53 కోట్లు
- రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు.. కానరాని మిగులు

అన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల ద్వారా రూ.142,89,13,196 ఆదాయం సమకూరగా వివిధ పద్దుల కింద రూ.147,53,85,371 వ్యయం చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆదాయ మార్గాల్లో వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.38.39 కోట్లు, ప్రసాదాల విక్రయాల నుంచి రూ.33.06 కోట్లు, భక్తుల హుండీల్లో సమర్పించిన కానుకల నుంచి రు.18.79 కోట్లు, వివిధ షాపుల లైసెన్స్ అద్దెల నుంచి రూ.15.76 కోట్లు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.5.49 కోట్ల ఆదాయం లభించింది. వివిధ పద్దుల ద్వారా వ్యయాన్ని పరిశీలిస్తే ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం భక్తుల సౌకర్యాలకు రూ.12.74 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టడంతో సుమారు రూ.5 కోట్ల వ్యత్యాసం కనిపించిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల జీతాలకు రూ.23.35 కోట్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.13.79 కోట్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు రూ.8.10 కోట్లు, నాయీ బ్రాహ్మణులు, వ్రత పురోహితులు ఇతరులకు రెమ్యునరేషన్ రూపంలో రూ.15.97 కోట్లు, ఎస్‌పీఎఫ్ భద్రతా సిబ్బందికి, సెక్యూరిటీ గార్డుల జీతాలకు రూ.4.35 కోట్లు, ప్రసాదం తయారీకి ముడిసరుకు కొనుగోలుకు రూ.23.17 కోట్లు వ్యయం చేశారు. రూ.12.74 కోట్లు వివిధ నిర్మాణాలు చేపట్టినందుకు చెల్లింపులు చేశారు. విద్యుత్, వాటర్‌వర్క్స్ సంబంధించి రూ.4.53 కోట్లు వ్యయం చేశారు.

రెజ్లింగ్ చాంపియన్‌షిప్ విజేత 'విజయవాడ'

రన్నర్‌గా కాకినాడ జట్టు



విజేతగా నిలిచిన విజయవాడ జట్టు సభ్యులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2025 ఆదివారం ముగిసింది. విజయవాడ జట్టు విన్నర్‌గా నిల్చి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించిందని చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా, ప్రెసిడెంట్ వెంకట్ ఇమ్మాణ్ణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొని జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో అర్హత కోసం పోటీపడ్డారు. కాగా అండర్-20, అండర్-15లో విన్నర్‌గా విజయవాడ పల్నాడు జట్టు నిలిచి ఓవరాల్ చాంపియన్ సాధించింది. రన్నర్‌గా కాకినాడ జట్టు నిలిచింది. విజేతలు ఈ నెల 23న రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారని తీగెల రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ ముత్యాలు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సెక్రటరీ సురేష్ ఉదయగిరి, కార్యక్రమ ఛైర్మన్ కామేశ్వరీదేవి, స్పోర్ట్స్ ఛైర్మన్ మద్దూరి శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్నబాబు, డైరెక్టర్లు కార్తీక్, వంశీ, శాయమ్, సంతోష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకు చెందిన ఇద్దరు టీడీపీ కార్యర్తలను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. గ్రామంలో రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ నాగబాబు తదితరుల కాన్వాయ్ కంటే ముందుగా వెళ్తున్న తనను శనివారం మధ్యాహ్నం దుర్భాషలాడడంతో పాటు తన మోటార్‌సైకిల్ అద్దాలను చినజగ్గంపేటకు చెందిన శీరం అప్పారావు, మరో వ్యక్తి పగులకొట్టారని వన్నెపూడి గ్రామానికి చెందిన జనసేన నేత మొయిళ్ల నాగబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సంఘటనకు సంబంధించి జనసేన నాయకుడిని అడ్డుకున్న వారిని నియంత్రిస్తుండగా తన విధులకు ఆటంకం కల్పించారని అప్పారావుతో పాటు రాంబాబుపై పిఠాపురం రూరల్ ఎస్‌ఐ జానీబాషా గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు టీడీపీ కార్యకర్తలు శీరం అప్పారావు, రాంబాబుఅలియాస్‌రామును అరెస్టు చేశారు.

అమలాపురంలో

బాలిక కిడ్నాప్ కలకలం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లి ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా చాకచక్యంగా తప్పించుకుని బయటపడ్డ ఘటనపై అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి దర్యాప్తు చేపట్టారు. కొంకాపల్లికి చెందిన బాలిక మూడో తరగతి చదువుతుంది. ట్యూషన్‌కు వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి వస్తూ స్థానికంగా ఉన్న గణపతి ఆలయం వద్ద దండం పెట్టుకుంటుండగా కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసి తీసుకుపోయారని బాలిక పోలీసులకు వివరించింది. అమలాపురం బస్టాండు సెంటర్‌కు సమీపంలోని శుభకలశం ప్రాంతానికి వచ్చేసరికి కారు డోరు పక్కన ఉన్న వ్యక్తి చెయి కొరికి బయటపడినట్టు చెప్పింది. తండ్రి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తుండడంతో బాలిక డిపోకు చేరుకుంది. అక్కడ తండ్రి గురించి ఆరా తీయగా విశాఖపట్నం డ్రైవర్‌గా వెళ్లినట్టు చెప్పి అతడికి సమాచారం అందించారు. దాంతో హైరానా పడ్డ డ్రైవర్ వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వారంతా పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. బాలికను పట్టణ సీఐ పి.వీరబాబు విచారిస్తున్నారు. ఈ ఘటనపై సీసీ కెమెరాల ద్వారా విచారణ చేస్తామని తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



అమలాపురం బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వేమాకి మిఠాయి తినిపిస్తున్న పవన్

మోదీ నాయకత్వంలో
ప్రగతిపథంలో దేశం

- మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా
- ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లాశాఖ కార్యాలయం వద్ద కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా ముఖ్య అతిథిగాహాజరై బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యిళ్ల సత్యనారాయణ, నాయకులు గోకరకొండ గంగన్నస్వామినాయుడు, గనిశెట్టి అరవింద్, అయ్యల బాషా, బొంతు శివాజీ, సాధ్విక్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పట్టణశాఖ కార్యాలయం వద్ద అరిగెల తేజ బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించగా సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, మోకా వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా బీజేపీ అభివృద్ధి చెందిందన్నారు. భారత ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో నడుస్తుందన్నారు. చెల్లింగి త్రినాథస్వామి, వడ్లమూడి ప్రకాష్, పితాని శ్రీను, దేవళ్ల మాణిక్యాలరావు, నార్కేడుమిల్లి బాలకృష్ణ, చింతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: భారతదేశం అంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వంవైపు చూస్తుందని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. పి.గన్నవరం అక్విడెక్టువద్ద మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్యక్షతన 45వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈకార్యక్రమంలో వేమా పాల్గొని మాట్లాడుతూ దేశంలో తద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మోదీ పాలనను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ స్థూపాన్ని ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, సీనియర్ నాయకులు ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, అడ్డాల వెంకటేశ్వరావు, చిట్నీడి రంగసాయి, కుడిపూడి సూర్య నారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం పట్టణంలో విష్ణాలయం సెంటర్‌లో పట్టణ అధ్యక్షుడు కొయ్యల దుర్గారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా బీజేపీ బిల్డింగ్, వర్కింగ్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల వీరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోనే రామమూర్తి, ఉంగరాల జగ్గారావు, బసవా శ్రీహరిబాబు, నలమాటి లంకరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భజరంగ్‌దళ్ మోటారు సైకిల్ ర్యాలీ

అల్లవరం: విశ్వహిందూపరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. మొగళ్లమూరిలో భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు సత్తియ్యనాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అల్లు అజయ్, కంకిపాటి వీరబాబు, మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, గూడాల పుల్లయ్యశెట్టి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని మండలపార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణులతో కలిసి మిఠాయిలు పంచారు. అనంతరం జిల్లా బీజేపీ అధికారప్రతినిధి మాలే శ్రీనివసనాగేష్ మాట్లాడుతూ దేశం కోసం పనిచేసేవారే లక్ష్యంగా 1951లో జనసంఘ్ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, మండల కార్యదర్శి బోనం నాయుడు, నాయకులు ఇందుకూరి సుబ్బరాజు, రావూరి బాబ్జి, ఉద్దరాజు రామకృష్ణంరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ ఆధ్వర్యంలో మామిడికుదు బస్టాండు కూడలిలో బీజేపీ జెండాను మైనార్టీ నాయకులు నన్నేసా హుస్సేన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, కటికిరెడ్డి గంగాధరం, కోటిపల్లి సాయిబాబు, భైరిశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞానయాత్రలు విద్యార్థుల పురోభివృద్ధికి దోహదం'



టి-142 యుద్ధ విమానాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్య విజ్ఞాన అభివృద్ధికి విశాఖ విజ్ఞానయాత్ర దోహదాన్నిచ్చిందని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లాలో 132 మంది ప్రాథమికస్థాయి విద్యార్థులతో 20 మంది గైడ్ టీచర్లు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, అకడమిక్ మోనిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఈ యాత్రను మూడు రోజులపాటు నిర్వహించారు. తొలుత యానాం బొటానికల్ గార్డెన్‌లో మొక్కల రకాలు పరిశీలించారు. జిప్మెర్ మెడికల్ విద్యాలయంలో వైద్య విద్య అవకాశాలపై అవగాహన కల్పించామని, ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమలో చెక్కబొమ్మల తయారీ, మిషనరీ పద్ధతులు, సాంప్రదాయ కళారూపాల గురించి ప్రత్యక్షంగా వీక్షించారన్నారు. విశాఖ నగరంలో రిషికొండ బీచ్, తోట్లకొండ బౌద్ధారామాలు, రామానాయుడు స్టూడియో, భీమిలి బీచ్, హిల్ పాయింట్, చారిత్రక, భౌగోళిక విషయాలను అధ్యయనం చేశారన్నారు. అక్కడ కెరియర్ మ్యూజియంలో నావిగేషన్, పాత యుద్ధ విమానాలు, వాతావరణ శాస్త్రం, వన్యప్రాణుల నమూనాలు వంటి అంశాలను వీక్షించి చరిత్ర, సైన్స్ పట్ల కొత్త కోణాల్లో ఆలోచింపచేసేందుకు దోహదానిచ్చిందన్నారు. నావెల్ మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియం, టి-142 యుద్ధ విమానాల మ్యూజియంను సందర్శించి భారత రక్షణ రంగంలో విశిష్టతలను గుర్తించారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, విశాఖ నగర మున్సిపల్ కమిషనర్‌లతో మాట్లాడడంతో విద్యాయాత్రకు ఎంతో సహకారం లభించిందన్నారు. విద్యా యాత్రలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను త్వరలో నివేదిక రూపంలో డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా ద్వారా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందించనున్నట్టు సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.

'మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి'

అమలాపురంరూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధిని సాధించిననాడే సమాజం పురోగమిస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు భట్నవిల్లిలోని మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్‌కు రూ.లక్ష సొంత నిధులు అందించడంతో ఏర్పాటుచేసిన పేపరు ప్లేట్ల తయారీ మిషన్‌ను ఎమ్మెల్సీ రవీంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. మహిళలు అన్నిరంగాల్లోను ప్రగతిని సాధిస్తున్నారని ఆర్థిక పురోభివృద్ధితో పాటు పొదుపులోను ముందంజలో ఉన్న నాడు దేశం మరింత పురోగమిస్తుందన్నారు. మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుణ్యమంతుల రజనీ, సంఘ సభ్యులను ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు అభినందించారు. సర్పంచ్ తిరుకోటి సుజాత, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు, మండలీక సుబ్రహ్మణ్యశర్మ (దత్తుడు) పాల్గొన్నారు. అనంతరం సంఘ సభ్యులకు పేపరు ప్లేట్ మిషన్‌ను వారు అందజేశారు.

ఘనంగా మాంటిస్సోరీస్ పాఠశాల వార్షికోత్సవం

రాజోలు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజోలు శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మాంటిస్సోరీస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గేదెల రమేష్, డాక్టర్ వరలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. చిన్నారులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, వేషధారణలు అందరినీ అలరించాయి. మాంటిస్సోరీస్ పాఠశాల డైరెక్టర్లు వాసు, రాంప్రసాద్, ప్రిన్సిపాల్స్ వసంతలక్ష్మి, ఎస్.జయలక్ష్మి, రాజోలు ఎంఈవో-2 ఎస్కేడీ ప్రసాదరావు, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మామిడికుదురు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి స్కూలు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూలు వార్షికోత్సవం కార్యక్రమం కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎం ఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను మొబైల్ ఫోన్ టీవీలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతీ విద్యార్థి పట్ల తల్లిదండ్రులు బాధ్యత కలిగి ఉండి వారి నడవడికను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. విద్యతో రాణించడం ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వారిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణం...రమణీయం

- కన్నుల పండువగా రాములోరి కల్యాణం
- వధువు సీతమ్మకు సమర్పించిన కంత సారె
- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



శ్రీపట్టాభిరామస్వామి, సీతమ్మ అమ్మవారు



అంబాజీపేటలో సీతారాములు



పి.గన్నవరం పట్టాభిరామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అరుణాచల గిరి



అమలాపురం కామాక్షీ పీఠంలో సీతారాముల కల్యాణం

పి.గన్నవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం వైనతేయ గోదావరినదీ తీరాన ఉన్న శ్రీపట్టాభిరామస్వామిఆలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రాంబాబు ఆచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ నిర్వాహకులు గ్రామానికి చెందిన పేరిచెర్ల భీమరాజు, శ్రీమతి వాణి దంపతులు క్షత్రియ సంప్రదాయం ప్రకారం వరుడు రాముడు తరుపున వధువు సీతమ్మకు కంతసారెను సమర్పించారు. కంతసారె, పిండి వంటలను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చలువ పందిరిలో ఏర్పాటు చేయడంతో వాటిని తిలకించేందుకు భక్తులుపోటెత్తారు. పాలకోవతో తయారుచేసిన పర్ణశాల, గోవిందనామం, చీరలు, పండ్ల రకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పి.గన్నవరం శివారు భవానీకాలనీ, పితానివారి పాలెంనకు చెందిన చిన్నారులు చేసిన కోలాటం భక్తులను అలరించింది. కల్యాణం అనంతరం సీతమ్మకు సమర్పించిన కంతసారెను భక్తులకు అందించారు. భారీ అన్నసమారధన జరిగింది. మండలంలోని పలు గ్రామాలలో శ్రీసీతారాముల ఆలయాలవద్ద శ్రీసీతారాముల కల్యాణాలు కమనీయంగా జరిగాయి. వర్తకసంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు.

అమలాపురం టౌన్/రూరల్: శ్రీరామనవమి పురస్కరించుకుని అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో వాడవాడలా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక వాహనాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద కల్యాణంజరిపించారు. అమలాపురం పేరమ్మ అగ్రహారంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నల్లా స్వామి, గంటి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కామాక్షీ పీఠంలో పీఠాధిపతి కామేశమహర్షి పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం జరిపించారు. పీఠం ఉత్తరాధికారి విమనస రాఖీప్రేమ్ బృందంచే పూజ్యం నాగేశ్వరశర్మ యాజ్ఞికంలో రాజమహేంద్రవరానికి చెందిన కోళ్లపర్తి శివరామారావు-సత్యశ్రీ దంపతులచే సీతారామ కల్యాణం జరిపించారు. బండారులంక అంబేడ్కర్ నగర్‌లో బళ్ల సత్తిబాబు ఆచార్య బ్రహ్మత్వంలో గోసంగి కార్తీక్-ప్రియాంక దంపతులు కర్తలుగా సీతారాముల కల్యాణం జరిపించారు. బండారులంకలో న్యాయమూర్తి కొండా బులికృష్ణ దంపతులు కర్తలుగా, అంకం శ్రీనివాసరావు, బళ్ల గోవిందుల పౌరోహిత్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, బండి సుబ్బారావు, గోసంగి సూర్యనారాయణ, బొంతు సూర్యప్రకాశరావు, కొల్లి అంబేడ్కర్, గుమ్మిడిరాజు, కొండా భాస్కరరావు, కొండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం పెద్దింటి చక్రధరాచార్యులు నిర్వహించారు. నంబూరి సత్యనారాయణమూర్తి, నంబూరి నరేష్ దంపతులు కర్తలుగా కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పి.వీరబాబు, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పి.సూరిబాబు, కంచర్ల వెంకట్రావు-శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు. కౌండిన్య నగర్‌లో తురగా సాయిప్రసన్నకుమార్-అనురాధ దంపతులచే నిర్వహించిన స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, కుడుపూడి వెంకటశ్రీనివాస్, కుడుపూడి త్రినాథరావు, మట్టపర్తి నాగేంద్ర, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం నల్లావీధిలో సీతారాముల కల్యాణంలో ఆర్డీవో కె.మాధవి కుటుంబ సభ్యులతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. భూపయ్య అగ్రహారంలో శ్రీసీతారామాచంద్రమూర్తి స్వామివారి దేవస్థానం ఆవరణలో ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులచే అర్చకులు వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు, వింజమూర్తి రవిల ఆచార్య బ్రహ్మత్వంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మండలంలోని సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ విగ్రహాలను ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సీతారాములకల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తలకు పానకాలు అందించారు.

ముమ్మిడివరం: శ్రీరామనవమి వేడుకలను రామాలయాల్లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు.ముమ్మిడివరంలోని టీటీఆర్ నగర్‌లోని సీతారామస్వామి ఆలయంలోను గంటావారివీధి, క్రాపచింతలపూడి, రాయుడువారిపాలెం, చినకొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి, అయినాపురం, సోమిదేవరపాలెం, కొత్తలంక, అన్నంపల్లి, గాడిలంక, కొమానపల్లి, కర్రివానిరేవు, మర్లపాలెం, లంకాఫ్‌ఠాణేలంక, పళ్లవారిపాలెం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం పంచారామక్షేత్రం, గుర్రంవారివీధి రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త నడింపల్లి సీతారామరాజు, రఘుపతిరాజుల ఆధ్వర్యంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు తదితరులు సన్మానించారు. డీసీఎం చైర్మన్ డాక్టర్ గోపీరాజు, రుద్రరాజు నానిరాజు, ఎంఎస్ఎన్ రాజు, నల్లా రాము పాల్గొన్నారు. యెంట్రుకోన కాల్వగట్టు రామాలయంలో గుబ్బల చినసత్యనారాయణ దంపతులు అల్లవరంలో వడ్డి సురేష్ దంపతులు కర్తలుగా కల్యాణోత్సవాలు జరిగాయి.బెండమూర్లంక విష్ణాలయ రామాలయం, యాల్లవారి రామాలయం, అల్లవరం, కోడూరుపాటు, బోడసకుర్రు, గోపాయిలంక, గోడిలంక, మొగళ్లమూరు, డి.రావులపాలెం, గోడి, సామంతకుర్రు, దేవగుప్తం, గూడాల, తాడికోనజరిగాయి.

ఐ.పోలవరం: శ్రీరామ నవమి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. కళ్యాణ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. మురమళ్ళ వీరేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు.

ఉప్పలగుప్తం: వాడపర్రు కోదండరామస్వామి ఆలయంలో టీటీడీ ఆగమ శాస్త్ర పండితుడు సుదర్శనం వెంకటజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో మాజీ సొసైటీ చైర్మన్ గొలకోటి సత్తిరాజు, వీరవేణి దంపతుల నిర్వహణలో కళ్యాణ పూజలు జరిగాయి. సత్తిరాజు దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. గొల్లవిల్లి రామాలయంలో వుంద్రు ఆదిత్య, ఉమాసరస్వతి దంపతుల నిర్వహణలో కళ్యాణం జరిగింది. వుంద్రు రామచంద్రరావు కుమారుడు రామకృష్ణఫణీంద్ర ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. సన్నవిల్లిలో గనిశెట్టి భాస్కరరావు, చిక్కం సురేష్ దంపతుల ఆధ్వర్యంలో కళ్యాణం జరిగింది. గుణ్ణాలపేటలో గనిశెట్టి సుబ్బారావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం జరిగింది. పెదగాడవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, ఎన్.కొత్తపల్లి, కూనవరం, చల్లపల్లి తదితర గ్రామాల్లో నవమివేడుకలు నిర్వహించారు.

కాట్రేనికోన: ఉప్పూడిలో రామాలయంలో బొబ్బిలి చిన్ని, శ్రీలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో, కాట్రేనికోనలో రామాలయంలో అణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి, భారతి దంపతుల ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణం జరిగింది. చెయ్యేరు, పెనుమెల్ల, లక్ష్మివాడ, బంటుమిల్లి, నడవపల్లి, గెద్దనపల్లి, చిర్రయానాం, పల్లం, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, కొప్పిగుంటల్లో సీతారాముల కళ్యాణవేడుకలు జరిగాయి.

మలికిపురం: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన కల్యాణాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చింతలమోరిలో సీతారాముల కల్యాణంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కల్యాణంలో భాగంగా గోపరాజు కుటుంబీకులు మహిళలకు పసుపు-కుంకుమ, విసినకర్రలు, పానకాలు పంపిణీ చేశారు.

యానాం: నియోజవర్గపరిలోని అన్ని రామాలయాల్లో శ్రీరామ కల్యాణంను వైభవంగా నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నియోజకర్గంలోని సుమారు 20రామాలయాల్లో జరుగుతున్న నవమి వేడుకల్లో స్వామివారిని దర్శించారు.

రాజోలు: పాలగుమ్మి నుంచి సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజోలు వశిష్ట నదికి చేరుకుని భక్తులు స్నానాలు ఆచరించారు.

అయినవిల్లి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తి శ్రద్ధలతో సీతారామ లక్ష్మణ హనుమాన్‌లకు పూజలు నిర్వహించారు. ఆలయాలవద్ద పానకం పంపిణీ చేశారు.

మామిడికుదురు: మగటపల్లిలోని సీతారాముల కల్యాణాన్ని జడ్పీమాజీ చైర్మన్ నామన రాంబాబు మనుమరాలు పద్మినీ-చంద్రనాథ్ దంపతులు కర్తలుగా పాల్గొని నిర్వహించారు. మామిడికుదురులోని శ్రీరామాలయం వద్ద నయినాల నాగేంద్రప్రసాద్-జగదీశ్వరి దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. మగటపల్లిలో జరిగిన వేడుకల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.



మలికిపురం రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



అమలాపురంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు



మగటపల్లిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



యానాంలో పూజలు చేస్తున్న మల్లాడి కృష్ణారావు

లక్ష్మీనరసింహుని ఆశీస్సులతో వారణాశి సైకిల్‌యాత్ర



సైకిల్‌పై యాత్ర చేస్తున్న రాము

అంతర్వేది, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భీమవరానికి చెందిన రాము అంతర్వేది పుణ్యక్షేత్రానికి సైకిల్‌పై విచ్చేసి స్వామివారిని దర్శించుకుని భీమవరం టూ వారణాశి, కేదారనాథ్‌లకు సైకిల్‌యాత్రను సాగిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సైకిల్‌పై భీమవరం నుంచి కన్యాకుమారి వరకు 1600 కిలోమీటర్లు యాత్ర చేశానని, రెండోసారి 2వేల కిలోమీటర్లు పైబడి ఉన్న భీమవరం నుంచి వారణాశి, కేదారనాథ్ యాత్రలో భాగంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు తీసుకుని అమలాపురం, విశాఖపట్నం, ఇచ్ఛాపురం మీదుగా ఒడిసా, పశ్చిమబెంగాల్ మీదుగా అక్కడకు చేరుకుంటానని తెలిపారు.ఆధ్యాత్మిక భావంతో ఈ సైకిల్ యాత్ర చేస్తున్నట్టు రాము తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యా యత్నం



ముమ్మిడివరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో విసుగు చెందిన ఓ వ్యక్తి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అల్లవరం మండలం గోసంగివారిపేటకు చెందిన జల్లి జనార్ధనరావు ఆదివారం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జనార్ధనరావు ఆదివారం ఉదయం ఇంటి నుంచి ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్దకు చేరుకుని వంతెనపై నుంచి గోదావరిలోకి దూకాడు. అదే సమయంలో వారధి వద్దచేపలు వేటాడుతున్న మత్స్యకారులు అది గమనించి జనార్ధనరావును రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. విషయాన్ని ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్‌కు, వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో అతని కుమారుడు సురేష్ ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జనార్ధనరావుకు ముగ్గురు కుమారులు, భార్య ఉన్నారు. జనార్ధనరావు గత కొన్నేళ్లుగా బీపీ, ఆయాసం వంటి వాటితో ఇబ్బంది పడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

'ఎన్నికల హామీలు అమలుచేయాలి'



ఈదరపల్లిలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా ఆదివారం ఈదరపల్లి గ్రామానికి చేరుకుంది. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాన్ని కేటాయించి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించాలని సత్తిబాబు డిమాండ్ చేశారు. గ్రామంలో ఇళ్లస్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. పేదలందరికీ గూడు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాళ్ల భీమరాజు, నియోజకవర్గ కార్యదర్శి గూడాల వెంకటరమణ, కురచ నాగేశ్వరరావు, మోకా శ్రీనివారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎదురు సన్నాహం



అమలాపురంలో ఎదురు సన్నాహం నిర్వహిస్తున్న దంపతులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం వేద పండితుల ఆధ్వర్యంలో ఎదురు సన్నాహం నిర్వహించారు. స్థానిక గారపాటివీధిలో యిండుగుల శ్రీనివాసరావు ఇంటి వద్ద నిర్వహించిన ఎదురు సన్నాహం కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. సుదర్శనం మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద నుంచి ఊరేగింపుగా మహిళలు ఎదురు సన్నాహంలో పాల్గొన్నారు. శ్రీనివాసరావు-పద్మావతి, వీరభద్రరావు-నాగరాధాకృష్ణకుమారి, శివరామసూర్యవరప్రసాద్-శాంతాదేవి దంపతులు పండిత సత్కారాలు నిర్వహించారు.

ఇంద్రజాలికుడు అలీకి ఉగాది పురస్కారం

మామిడికుదురు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు, నగరం గ్రామానికి చెందిన అలీ ఉగాది పురస్కారం-2025ను అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ సంగమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సంస్థ అధ్యక్షుడు సంజయ్‌కిశోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖలకు ఉగాది పురస్కారాలను అందించారు. కళారంగంలో అలీ చేసిన సేవలకు గుర్తింపుగా ఘనంగా సన్మానించి ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. సన్మానాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్‌కిశోర్, నటీ వై.విజయ, నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్వహించారు.



ఉగాది పురస్కారం స్వీకరిస్తున్న ఇంద్రజాలికుడు అలీ

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం

అంతర్వేది, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరంనకు చెందిన డీవీఎస్ రావు, ప్రతిమ దంపతులు రూ.50వేలు విరాళంగా అందించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటంను అందించారు.

రేపు స్వామివారి కల్యాణం

ముమ్మిడివరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని ప్రసిద్ధి శ్రీఉమాసూరేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని 8వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు కొత్తలంక సూరిబాబు తెలిపారు. 8 రాత్రి 7.30 గంటలకు కల్యాణం, 9న వసంతపూజ, 10న సదస్యం, 11న నడిమిలంక గ్రామంలో చోరోత్సవం12న త్రిశూల స్నానం, నాగవల్లి, 13న పుష్పోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయఅర్చకుడు సూరిబాబు తెలిపారు.

పాళ్లమ్మ అమ్మవారి జాతర పోస్టర్ ఆవిష్కరణ

మామిడికుదురు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామదేవత పాళ్లమ్మవారి జాతర పోస్టర్‌ను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కరపత్రాలను అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆవిష్కరించారు. ఈనెల 18 నుంచి 21 వరకు జాతర నిర్వహిస్తామన్నారు.



అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.32 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,32,524 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరం కొంతమూరుకు చెందిన సూరపరెడ్డి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ.1.16 లక్షలు విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందచేశారు.

నెలాఖరు వరకు 30 యాక్ట్ అమలు

రాయవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో నెలాఖరు వరకు 30 యాక్ట్ అమల్లో ఉంటుందని రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేదమన్నారు. సమావేశాలు నిర్వహించుకోవాలంటే రామచంద్రపురం డీఎస్పీ అనుమతి తీసుకోవాలని ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల సీజ్

కె.గంగవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లపాలికలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా చెప్పారు. తమకు అందిన సమాచారంతో అర్ధరాత్రి దాడి చేయగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆదివారం తహశీల్దార్‌కు అప్పగించామన్నారు.

ఆందోళన విరమణ

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఇసుక ర్యాంపు సమీపంలో శనివారం గోదావరి నదిలో స్నానానికి దిగిన రొట్టా దుర్గాప్రసాద్(21) మృతి చెందిన విషయం తెలిసిందే. ఇసుక ర్యాంపు గోతుల కారణంగానే దుర్గాప్రసాద్ చనిపోయాడంటూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు, మృతదేహం వద్ద ధర్నా జరిపారు. వారితో మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. మృతుని తండ్రి రొట్టా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అంగర ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కాలువలో యువకుడి గల్లంతు



షేక్ ఖాదర్

రావులపాలెం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కాలువలో స్నానానికి వెళ్లిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రావులపాలెం మండలం ఈతకోట నెక్కంటికాలనీకి చెందిన 21 ఏళ్ల యువకుడు షేక్ ఖాదర్, షేక్ రజి, దేవరపల్లి బాలాజీలు గోపాలపురం ఆరుమామిళ్ల వద్ద గన్నవరం ప్రధాన పంట కాలువలో స్నానానికి దిగారు. వీరు ఈత కొడుతున్న తరుణంలో షేక్ ఖాదర్ గల్లంతయ్యాడు. దీంతో కంగారుపడిన మిగిలిన ఇద్దరు ఒడ్డుకు వచ్చి కేకలు వేశారు. అక్కడకు చేరుకున్న స్థానికుల్లో కొంత మంది గల్లంతైన యువకుడి కోసం గాలించిన ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకుని గాలింపు చేపట్టారు. రాత్రి వరకు గాలింపు కొనసాగుతోంది.

మద్యం దుకాణం ఏర్పాటు తగదు

మండపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) సత్యశ్రీ రోడ్డులో వున్న సప్తగిరి థియేటర్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు తగదని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. పట్టణంలో మూడు వార్డులకు చెందిన ప్రజలు కొద్ది రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వారు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. మున్సిపాల్టీలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని తీర్మానం చేసినా పట్టించుకోవటం లేదని ఆయన ఆరోపించారు. తమ పార్టీ తరపున బాధితులకు సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే వారి సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మండపేట కరాచీ సెంటర్‌లో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

మండపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): డెలివరీ సెక్షన్‌లో పనిచేసే కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని మండపేట లేబర్ అధికారి కె.శివనాగేమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు ఈ పోర్టల్ లింకులో తమ పేర్లను వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు



ఆలమూరులో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో సీతారామచంద్ర ఆలయ పునఃప్రతిష్ఠలో ఎమ్మెల్యే సత్యానందరావు



రామచంద్రపురం మండలం వెలంపాలెం వేద పాఠశాలలో జరిగిన సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న మంత్రి సుభాష్

వైభవంగా సీతారాముల కల్యాణం

• ఆలయాలకు పోటెత్తిన భక్తజనం • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • పానకం, ప్రసాదాల పంపిణీ



రాయవరం మండలం వెదురుపాకలో రాములవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కె.గంగవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల మధ్య స్వామి వారి కల్యాణం జరిపించారు. గ్రామంలోని పెద్ద వీధి, చెరువు వీధి, కొత్తపేట వీధుల్లో చలువ పందిళ్లలో ఏర్పాటు చేసి ఆరుబయట స్వామి వారి ఉత్సవమూర్తులకు అభిజిత్ లగ్నంలో కల్యాణం చేశారు. గ్రామంలో మరో మూడు చోట్లు స్వామివారి కల్యాణాన్ని ఆయా ఆలయాల్లో నిర్వహించారు.

తలంబ్రాల బియ్యం కోసం పోటీపడిన మహిళలు: స్వామి వారి కల్యాణంలో భాగంగా పోసే తలంబ్రాల సేకరణకు మహిళలు పోటీ పడ్డారు. స్వామి తలంబ్రాలతో పాయసం సేవించిన వారికి సంతాన భాగ్యం కలుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. దీంతో వాటి కోసం మహిళలు పోటీపడ్డారు.

ఆకట్టుకున్న చలువ పందిళ్లు: సీతారాముల కల్యాణం కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ఆకట్టుకున్నాయి. కాగితాలతో చేసిన పూలను కుండీలుగా చేసి పందిళ్లకు అలంకరించారు.

కల్యాణాన్ని తిలకించిన ప్రముఖులు: సత్యవాడలో సీతారాముల కల్యాణాలను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి, టీడీపీ సీనియర్ నాయకుడు గంధం పళ్లంరాజు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు తిలకించారు. భక్తులకు గ్రామస్తులు మజ్జిగ పంపిణీ చేశారు. పలు కూడళ్లలో అన్నసమారాధనలు చేశారు.

రామాలయానికి మండువా లోగిలి రాసిచ్చిన దాత: కోట గ్రామంలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన దివంగత వట్టికూటి వెంకట్రాజు కుటుంబానికి చెందిన వారు పలు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆదివారం గ్రామంలోని కమ్మవారి రామాలయంలో జరుగుతున్న కల్యాణానికి వచ్చారు. రామాలయానికి సుమారు 70 లక్షల విలువైన 40 సెంట్ల స్థలంలోని మండువా లోగిలిని రామాలయానికి దానం చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్ అభినందించి సన్మానించారు. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, తామరపల్లి, గంగవరం తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. అన్న సమారాధనలు చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. పీఠం వేదపండితులు చిమలకొండ వీరావధాని, అర్చకులు చక్రవర్తుల మాధవాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మధుపర్క సమర్పణ, యజ్ఞోపవీతధారణ మంగళధారణ, తలంబ్రాలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలు, పానకం, ప్రసాదాన్ని పంపిణీ చేసి అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ, పీఆర్వో బాబి తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సీతారామ కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో సీతారామ కల్యాణాలు: మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారామ కల్యాణాలు నిర్వహించారు. రాయవరం వెలమపేట, రెడ్ల రామాలయం, వెదురుపాకలో రెడ్ల రామాలయం, కాపుల రామాలయం, శెట్టిబలిజ రామాలయం వద్ద శ్రీరామ కల్యాణం జరిపి అన్నసమారాధన జరిపారు. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పల్లకీలో ఊరేగించిన అనంతరం ఆలయాల్లో ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి కల్యాణం జరిపారు. ఆయా ఆలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. ఆలయాల వద్ద పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చింతాకు పతకం బహూకరణ: ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన కాకర్లమూడి వెంకటసుభద్రాదేవి సీతమ్మ అమ్మవారికి చింతాకుపతకం బహూకరించి తన భక్తిని చాటుకున్నారు. పెదపళ్ల తూర్పు వీధి రామాలయంలో అమ్మవారికి 24 గ్రాముల బంగారు చింతాకు పతకం అలంకరించారు. దాత సుభద్రాదేవిని గ్రామస్తులు సత్కరించారు.



ఆలమూరు మండలం మడికిలో శ్రీరామనవమి వేడుకలకు వచ్చే భక్తులకు మజ్జిగ అందిస్తున్న ముస్లింలు

మజ్జిగ పంపిణీ చేసిన ముస్లింలు: ఆలమూరు మండలం మడికి(చిలకలపాడు)లో జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు వచ్చే భక్తులకు ముస్లిం కమ్యూనిటీ అధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ అందిం చారు. కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ నాయకులు గులాం అహ్మద్, మహమ్మద్ సిరాజ్, మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో పునర్నిస్తున్న సీతారామ చంద్రుల శిఖర, ధ్వజ, ఆలయ పునఃప్రతిష్ఠను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంట్రాక్టర్లు జ్ఞాన సత్యనారాయణ, జ్ఞాన శ్రీను ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. శ్రీరామ నవమి రోజున సీతారామ ఆలయ ప్రతిష్ఠ చేపట్టడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమం లో ముదునూరి వెంకట్రాజు, కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పానకం పంపిణీ: ఆత్రేయపురం పెదరామాలయంలోనున్న రాములవారికి పాతపాటి వెంకటసత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి, రామాంజనేయరాజు, లక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, సారె చీరలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. వేద మంత్రాల మధ్య సీతారాముల కల్యాణం నిర్వహించారు.

స్వామివారికి వెండి మారేడు దళాలు బహూకరణ: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం ఊబలంకకు చెందిన సత్తి దొరారెడ్డి దంపతులు వెండి మారేడు దళాలు సమర్పించారు. ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ మురళీమనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.

సీతమ్మ అమ్మవారికి మంగళ సూత్రాలు, నల్ల పూసలు బహూకరణ: ఆత్రేయపురం పెద్దరామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పాతపాటి రామాంజనేయరాజు, లక్ష్మి దంపతులు సీతమ్మ వారికి బంగారు సూత్రాలు, నల్లపూసలు రాముల వారికి వెండి వస్తువులు రూ.5లక్షల విలువైన సామగ్రిని అందచేశారు. దివంగత ఐ.వెంకటరామరాజు భార్య మంగతాయారు రెండు కిలోల వెండి సామగ్రి, ముదునూరి గోపాలకృష్ణరాజు, రామసీత దంపతులు వెండిపాదాలు, ముదునూరి రామరాజు, రమా దంపతులు బంగారు నామం స్వామివారికి అం దించారు. అనంతరం వాటిని అలంకరించారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ, మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. రామచంద్రపురం మండలం వెలంపాలెంలో వేద పాఠశాలలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారి నగరోత్సవం జరిగింది. మధ్యాహ్నం 11.52 గంటలకు మైలవరపు మృత్యుంజయశర్మ సీతారాముల కల్యాణం నిర్వహించారు. మంత్రి సుభాష్ పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, పులవర్తి వెంకట రవిబాబు, అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు సీతారాములకు సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. మండలంలోని యనమదల, నరసాపురపుపేట, వెంకటాయపాలెం, తాళ్లపొలం, వెల్ల, కాపవరం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

రామచంద్రపురంలో: రామచంద్రపురంలోని రాజగోపాల్ సెంటర్‌లో ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని జరిపారు. మార్కెట్ సెంటర్ రామాలయం, గుబ్బలవారి పేట, చప్పిడివారి సావరం, ముచ్చుమిల్లి, శీలంవారి సావరం, ద్రాక్షారామ రోడ్ రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

నవమి వేడుకల్లో పాల్గొన్న సత్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ) (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం, మండలంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు. పట్టణంలోని చప్పిడివారి సావరం, మండలంలో భీమక్రోసుపాలెం, తోటపేట, తాళ్లపొలం గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొని పూజలు జరిపారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు జరిపారు. అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, టేకి, కాలేరు, వల్లూరు, కేదార్లంక తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం పలు ఆలయాల వద్ద అన్నసమారాధనలు జరిపారు. ఆయా గ్రామాల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించి భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండపేటతో పాటు, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. మండపేటలోని కరాచి సెంటరులో వున్న అంజనేయస్వామి ఆలయంలో సువర్ణ వర్తక సంఘ ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. బూరుగుంట సీతారామక్షేత్రంలో శ్రీరామనవమిని వైభవంగా జరిపారు. పాటిమీద శెట్టిబలిజ సంఘం, శ్రీరామ నాయి బ్రాహ్మణ సంఘం, పట్టణ టైలర్స్ సంఘం, గొల్లపుంత రామాలయం, వెలమ సంఘం, తూర్పు రామాలయం, కమ్మ సంఘం రామాలయం, వల్లూరి వారి వీధి రామాలయం, దర్మగుండం చెరువు వద్ద కమ్మ సంఘ రామాలయంతో పాటు తాపేశ్వరం, అర్తమూరు, ఇప్పనపాడు, ద్వారపూడి, ఏడిద, కేశవరం, వై.సీతానగరం, పాలతోడు, వెలగతోడు తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద అన్న సమారాధన, ప్రసాద వితరణ చేశారు. మండపేటలోని గొల్లపుంత రామాలయానికి పట్టణానికి చెందిన ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇనపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్) ఆర్థిక సహకారంతో నిర్మించిన రామాలయం మండపాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు అద్దంకి వీర్రాజు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇనకోళ్ల సత్యనారాయణతోపాటు ఆయన సహచర మిత్రులు హాజరై తమ పూర్వపు ఉపాధ్యాయుడు వీర్రాజు మాస్టార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో స్వామివారి రథోత్సవం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని పాత, కొత్త రామాలయాలతో పాటు శ్రీరామ్‌నగర్‌లో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. మామిడిశెట్టి సోమరాజు బ్రదర్స్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించి భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని ముసలి రామాలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి ఆధ్వర్యంలో రాములోరి కల్యాణాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.



రామచంద్రపురంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



రాయవరంలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



కె.గంగవరంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, యు.ప్రసాదరాజు, పాలాటి మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జొన్నాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు అధ్వర్యం లో జొన్నాడ సెంటర్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రాయవరంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు మాట్లాడారు. తొలుత బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్స్ పంచిపెట్టి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చెరుకూరి వీరవెంకట సత్యనారాయణ, కంటిపూడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కె.గంగవరంలో పార్టీ నాయకులు నిర్వహించారు. బస్‌స్టాండ్ సెంటర్‌లో ఉన్న స్థూపం వద్ద జెండా ఆవిష్క రించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, కన్వీనర్ సలాది శేఖర్, నాయకులు గుర్రాల సత్యనారాయణ, అవసరాల రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ద్రాక్షారామలో నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ఆకేటి శ్రీకృష్ణ అధ్వర్యంలో జరిగిన ఆవిర్భావ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో: రామచంద్రపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీజేపీ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు తదితరులతో పాటు, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి శ్రీను, పులిగడ్డ సురేష్, కొనపాల గణేష్, అంకం ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండపేట మండలం పాల తోడులో బీజేపీ నేతలు జరిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాలిక రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కెవీవీ సాయిరామ్, నీల సత్యనారాయణ, ఉండమట్ల దుర్గాప్రసాద్, వాసంశెట్టి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని అవిష్కరించిన అనంతరం మిఠాయిలు పంచారు.



మండపేట మండలం పాలతోడులో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చలివేంద్రాలు ప్రారంభం

మండపేట, ఏప్రిల్, 6(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని పలువురు దాతలు చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో దివంగత ఇనపకోళ్ల శ్రీనివాసరావు దుర్గాప్రసాద్‌ల జ్ఞాపకార్థం ఐఎస్‌డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఆయన కుటుంబ సభ్యులు ఇనపకోళ్ల సత్యనారాయణ(ఐఎస్ఎన్) చే కలవపువ్వు సెంటరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు అద్దంకి వీర్రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఆర్ఆర్ఆర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ప్రారంభించారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

మండపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత థైరాయిడ్, బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహిస్తామని సంఘ నాయకుడు కోన సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత యోగా శిక్షణ కేంద్రం



మండల పరిషత్ ప్రాంగణంలో యోగా శిక్షణ కేంద్రంలో పాల్గొన్న మహిళలు

కొత్తపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయలు వేదికలో స్వామి వివేకానంద యోగాశ్రమం గురువు డాక్టర్ యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఈ శిక్షణలో మహిళలు, యువతులు పాల్గొని యోగాసాలను వేశారు. ప్రతి రోజు ఒక గంట యోగా చేయడం ద్వారా శారీర, మానసిక రుగ్మతలు తొలగి సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని యోగా శ్రీనివాస్ తెలిపారు.